# ఓ రియల్ ఫ్రెండ్

- షాహీన్

''వసూ! వసూ!'' అంటూ ఒక పేపరు పట్టుకుని గట్టిగా పిలిచాడు అర్జున్.

''ఏమిటండీ?'' వంటింట్లోనుండి జవాబిచ్చింది వసుధ.

''త్వరగారా'' అన్నాడు మళ్ళీ అదే స్థాయిలో.

''ఆ...వస్తున్నా?'' అంటూ గబగబా వంటింట్లో నుండి వరండాలోకి వచ్చింది వసుధ.

''ఈ పేపర్లో చూడు...వీడు నా ఫ్రెండ్ శ్రీలా లేడూ?'' సినిమా పేపర్లోని ఫోటోని చూపుతూ అన్నాడు.

''అవునండీ అచ్చు మీ ఫ్రెండ్‌లానే వున్నాడు. కానీ...ఇతను పెద్ద యాక్టర్ ఆకాశ్ అని వ్రాసి వుంది'' సందేహంగా అంది వసుధ.

''అవును. పేరు ఆకాశ్ అని వుంది. అదే నాకూ అర్థం కావడంలేదు.''

''అయితే మీ స్నేహితుడ్ని పోలిన మరో మనిషై వుండవచ్చు''

''కానీ ముక్కుకి కుడివైపున్న ఆ పెసరగింజంత పుట్టుమచ్చ మా శ్రీకి కూడా వుండేది. ఈ దెబ్బ చూడు. మా చిన్నప్పుడు ఆడుకుంటుంటే వాడు పడిపోయినప్పుడు రాయి గుచ్చుకుని నుదుటికి పెద్ద గాయం కూడా అయింది. ఆ గాయం కూడా వుంది చూడు'' అన్నాడు ఓ క్లోజప్ ఫోటో చూపిస్తూ.

''అయితే ఇతను మీ ఫ్రెండ్ శ్రీనాథే అంటారా?''

''ముమ్మాటికీ వాడే. కానీ పేరే...'' మళ్లీ సందేహంలో పడ్డాడు.

''ఏమండీ! చాలామంది సినిమా యాక్టర్లు వాళ్ళ అసలు పేర్లు కాకుండా వేరే పేర్లు పెట్టుకుంటారండీ. మీ స్నేహితుడు కూడా అలాగే చేసి వుంటాడేమో!''

''అంతేనంటావా?''

''ముమ్మాటికీ అంతే! ఇంతకీ అందులో ఏం రాసి వుందో చదవండి'' అంటూ ఆత్రంగా పేపర్లో చూసింది వసుధ.

''ఆ...ఇక్కడ వాడి గురించి అంతా రాసారు వసూ'' అంటూ ప్రక్కపేజీ చూస్తూ చదవడం ప్రారంభించాడు.

''ఆకాశ్ స్వయంకృషితో, పట్టుదలతో పైకొచ్చిన ఏకైక నటుడు. వీరి విద్యాభ్యాసం అంతా రామాపురంలో జరిగింది. బిఏ హైదరాబాద్‌లోనే చదివారు. అతను చదివిన ఊళ్ళోనే తను నటించిన చిత్రం శతదినోత్సవం జరుపుకోవడం ఓ విశేషం. ఆకాశ్‌గారి అసలు పేరు శ్రీనాథ్. కానీ ఆ పేరుతో మరో నటుడు వుండడంతో పేరు మార్చుకుని ఆకాశ్ అని పెట్టుకున్నారు.''

ఆ వాక్యం చదువుతూనే ''వసూ...వసూ వాడు మన శ్రీనే'' అన్నాడు ఉత్సాహంగా.

అంతా చదివిన తరువాత ప్రక్క పేజీ తిప్పి చదివిన అతని మొహం మెర్క్యూరీ లైట్‌లా వెలిగిపోయింది.

''మా శ్రీని హీరోగా పెట్టి తీసిన మూడు సినిమాలూ ఒకేసారి విడుదలయ్యాయి. మూడూ శతదినోత్సవం జరుపుకోబోతున్నాయిట. మూడింటినీ మూడుజిల్లాల్లో చేస్తున్నారట. ఒక సినిమా శతదినోత్సవం మన ఊరికి దగ్గరగా వున్న హైదరాబాద్‌లో పదహారవ తేదీన, మరొకటి గుంటూరులో, ఇంకోటి విశాఖపట్నంలో జరుపుతారట. ఇంతవరకూ ఏ హీరో సినిమాలూ ఇలా ఒకేసారి విడుదల కాలేదనీ, అయినా ఒకేసారి శతదినోత్సవం జరుపుకోలేదని వ్రాసారు. ఆకాశ్ పేరుకు తగ్గట్టు ఆకాశమంత ఎత్తుకు ఎదగాలని వ్రాసారు. ఇప్పటికే ఎందరో అభిమానులు ఊరూరా అభిమాన సంఘాలు నెలకొల్పారని, వారందరూ ఈ శతదినోత్సవం వైభవంగా జరపదలచారని వ్రాసారు.''

అంతా చదివిన తర్వాత ''వసూ! నేను చెప్పలేదూ వీడు మన శ్రీనాథేనని. నా స్నేహితుడింత ఉన్నత స్థాయికెదిగినందుకు నాకెంత ఆనందంగా వుందో తెలుసా? వసూ! మనం ఒరిస్సాలో ఉండడంతో అసలు ఈ తెలుగు సినిమాలనే మరచిపోయాం. మొన్ననేగా మన స్వంత ఊరు వచ్చింది. లేకపోతే ముందే తెలిసి వుండేది. వసూ! మా ఇంట్లో పెరిగిన వాడు ఇంత ఉన్నత స్థాయికి ఎదిగాడంటే నమ్మలేకుండా వున్నాను'' అన్నాడు ఆనందంగా.

''అవునండీ మీ స్నేహితుడు ఇల్లొదిలి వెళ్లి సుమారు ఎన్ని సంవత్సరాలై వుంటుందంటారు?''

''బహుశా! నాలుగు సంవత్సరాలై వుంటుందేమో! వాడు మా ఇంటిపక్కనే అంటే ఇప్పుడు శంకరం వాళ్ళున్నారుకదా. అందులోనే వుండేవాడు. ఇద్దరం ఎంతో కలసి మెలసి అన్నదమ్ముల్లా వుండేవాళ్ళం. వాడికి పది పదిహేనేళ్ళ వయసున్నప్పుడు వాళ్ళమ్మానాన్నా గోదావరి పుష్కరాలకి వెళ్లి వస్తూ ట్రైన్ ఆక్సిడెంట్‌లో చనిపోయారు. అప్పటినుండి వాడు మా ఇంట్లోనే అదే ఈ ఇంట్లోనే వుండేవాడు. వాడికి తల్లీదండ్రీలేని లోటు లేకుండా చూసారు మా అమ్మానాన్నా. ఇద్దరం ఒకే స్కూలులో తరువాత ఒకే కాలేజీలో డిగ్రీలు పూర్తిచేశాం.

ఎప్పుడూ అంటుంటేవాడు ''జీవితం అంటే ఇదేనా? ఏదో సాధించాలి. ఏదీ సాధించలేనప్పుడు జీవించడం అనవసరం' అని. సినిమాలన్నా, సినిమా ఆర్టిస్టులన్నా ఎంతో ఇష్టం చూపేవాడు. ఒక సినిమా చూడడం, ఆ సినిమాలో హీరో ఎలా చేస్తే తానూ అలాగే చేసి చూపేవాడు. ఎప్పటికైనా ఓ గొప్ప సినిమా నటుడు కావాలని కలలు కనేవాడు. అనుకున్నది సాధించాలని అనేవాడు. అలాగే చెబుతూ ఒకరోజు హఠాత్తుగా చెప్పకుండా ఇల్లొదిలి వెళ్లిపోయాడు. మానాన్నగారు పోలీసు రిపోర్టు కూడా ఇచ్చారు. ఎక్కడా జాడ తెలియలేదు. మళ్ళా ఇన్నాళ్ళకి ఇలా...అమ్మా నాన్నా వుంటే ఎంత ఆనందించేవారో? వాళ్ళకా అదృష్టం లేకపోయింది'' గట్టిగా ఓ నిట్టూర్పు విడిచాడు.

''ఏవండీ! మీ ఫ్రెండు పెద్ద సినిమా యాక్టర్ అయ్యాడుకదా. శతదినోత్సవం కూడా పక్క ఊర్లోనే అవుతుందంటున్నారు. మరి మనం వెళదామండీ?''

''మనమా? ఆ శతదినోత్సవం సభకా? అక్కడ బోలెడు జనం వుంటారుకదా?''

''ఉంటే? ఎంతైనా మీ ఫ్రెండు కదండీ. అందులోనూ చిన్నప్పటినుంచీ మీతోనే కలసిమెలసి వున్నవాడు. మీ ఇంట్లోనే పెరిగాడు. మీరు కనిపిస్తే మాట మాత్రంగానైనా పలకరించడా?''

''వాడంత గొప్ప వాడయ్యాడుకదా నన్ను పలకరిస్తాడా?''

''అతనికైనా ఎవరున్నారని బంధువులు?''

''నీకింకా లోకం గురించి తెలీదు వసూ. డబ్బుతో పాటు బంధువులు కూడా పుట్టుకొస్తారు.''

''పోనీ మీరైనా కనీసం శతదినోత్సవానికి వెళ్లి మీ ఫ్రెండ్‌ను చూసిరండి.''

''ఎందుకులెద్దూ? వాడికి మనం గుర్తుంటామా ఏమిటి?''

''ఎందుకు గుర్తుండరండీ. మనకు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ ఆడపిల్లలే. మీ జీతంతో మనకు నెలంతా గడవడమే ఎంతో కష్టంగా వుంది. మీ అమ్మానాన్నా వదిలివెళ్లిన ఈ స్వంత ఇల్లు వుండబట్టి ఇలా గడుస్తోంది. లేకపోతే ఒంటిపూట భోజనమే గతి. మనం వున్న ఈ పరిస్థితుల్లో మీ ఫ్రెండుని సహాయం అడగకూడదండీ!''

''వాడ్నా? సహాయమా?''

''అవునండీ. ఇప్పుడతను మీ శ్రీకాదు. కోట్లాది ప్రేక్షకుల అభిమాన హీరో. అతనికి పెద్దపెద్ద వాళ్ళతో సంబంధాలుంటాయి. వాళ్ళెవరికైనా చెప్పి మీకు ఓ మంచి ఉద్యోగం ఇప్పించగలడేమో అడగండి. మీరు ఇవన్నీ

అడగాలంటే ఆ సభకి వెళ్లి అతన్నెలాగైనా కలుసుకుని మాట్లాడండీ!''

``వసూ! నీకేమైనా మతిపోయిందా? వాడ్ని ఉద్యోగం అడగడమేమిటి?'' కోపంగా అన్నాడు.

``అతన్ని మీరప్పుడు ఆదుకోకపోయి వుంటే ఇప్పుడింత పెద్ద హీరో అయ్యేవాడా?''

``వాడు మనకు తిరిగి సాయపడాలనిగానీ, అలా పడతాడనిగానీ అప్పుడు వాడ్ని ఆదుకోలేదు. మేం వాడ్ని ఆదుకున్నంత మాత్రాన వాడినుండి ఇప్పుడు సహాయం అర్థించడం ఏం బావుంటుంది చెప్పు?''

``మీరు నేను చెప్పింది అర్థం చేసుకోరేమండీ? మీకొచ్చేది చాలీచాలని జీతం. ఆ ఉద్యోగం ఎప్పుడుంటుందో ఎప్పుడూడుతుందో తెలీదు. ఆ కాంట్రాక్టర్ ఎక్కడికెళ్లమంటే అక్కడికి మనం మూటాముల్లె సర్దుకుని వెళ్లిపోవాలి. మీకతను అంత మంచి స్నేహితుడు కదా సహాయం అర్థించడంలో తప్పేమిటో నాకర్థం కావడం లేదు. మీరూ, మీ కుటుంబం అతన్ని ఆదుకున్నారు. కాబట్టి ఇప్పుడు మీరు సహాయం అడగడంలో తప్పులేదు'' అంది.

``నువ్వు ఎన్నయినా చెప్పు. నేను ఛస్తే వాడి సహాయం కోరను. మనకు భగవంతుడిచ్చింది చాలు.''

``పోనీ రేపు ఆ సభకైనా వెళతారా లేదా?''

``వెళతాను. వాడ్ని, వాడు సాధించిన ఘనతను చూసి వస్తాను'' అన్నాడు ఉత్సాహంగా.

● ● ●

హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియం జనంతో కిక్కిరిసిపోయి వుంది. ముందుగానే వెళ్లడంతో అర్జున్ మూడో వరుసలో కూర్చున్నాడు. రెండుగంటలు నిరీక్షించిన తరువాత ఒక్కొక్కరే రాసాగారు. చివర్న హీరో ఆకాశ్ వచ్చాడు.

తెల్లని లాల్చీ, పైజమా ధరించి వొత్తుగా వున్న ఉంగరాల జుట్టు, మెడలో బంగారు గొలుసు ధరించి చూడ్డానికి రెండు కళ్ళు చాలవనిపించేలా వున్నాడు. వాడు తన శ్రీయేనా అని ఆశ్చర్యపోయేలా వున్న ఆకాశ్‌ని చూసి ఎంతో సంబరపడ్డాడు అర్జున్. ఆకాశ్ ఒక్కో మెట్టు ఎక్కుతుంటే జనం చప్పట్లు లయబద్ధంగా కొడుతున్నారు. అది చూసిన అర్జున్ మనసు ఆనందంతో ఉప్పొంగింది. సంతోషం పట్టలేక అతను కూడా చప్పట్లు కొట్టసాగాడు.

ఆకాశ్ వేదిక మీదకు ఎక్కిన తరువాత అభిమాన సంఘాల వాళ్ళు పూలహారాలు వేసారు. ఆ బరువైన హారాలకు ఆకాశ్ తల కొంచెం వంగింది. ఎందరో సినీ ప్రముఖులు విచ్చేసారు. అందరూ ఆకాశ్ ప్రతిభను, కృషిని కొనియాడారు. అతను నెంబర్‌వన్ అవుతాడని ఆశీర్వదించారు. తను తీయబోయే రెండు సినిమాలలో ఆకాశ్‌నే పెట్టుకుంటానని ఒక ప్రముఖ నిర్మాత చెప్పాడు. మూడు సినిమాలు ఒకేసారి శతదినోత్సవం జరిగి హ్యాట్రిక్ సాధించిన ఘనత ఒక్క ఆకాశ్‌కే దక్కుతుందని మరో దర్శకుడు అభినందించాడు. అలా అందరూ అతని గొప్పతనాన్ని పొగిడారు. అదంతా చూస్తున్న అర్జున్‌కు నోటమాట రాలేదు. అతని మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. 'తనతో గోళీబిళ్ళలు ఆడిన వాడేనా ఇంత పెద్దవాడై పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తోంది' అని ఆశ్చర్యపోయాడు.

తనకున్న ఒక్కగానొక్క స్నేహితుడు ఆకాశ్ అయినందుకు, అతనంత పెద్ద సినిమా యాక్టరై కీర్తిశిఖరాలు అందుకున్నందుకు ఎంతో గర్వించాడు. అన్నివేలమంది జనం మధ్య నిలబడి తానీ గొప్ప యాక్టర్‌కు స్నేహితుడినని అరవాలనిపించింది. తన ఊహకు తానే సిగ్గుపడ్డాడు. ఇంతలో సభ ముగిసింది. ఒక్కొక్కరే వేదిక దిగిపోసాగారు. తనెలాగైనా ఆకాశ్‌తో మాట్లాడాలనుకున్నాడు అర్జున్.

అంతే! జనాన్ని తోసుకుని గబగబా శ్రీనాథ్‌వైపుకు పరుగెత్తాడు.

``శ్రీ...శ్రీనాథ్...'' గట్టిగా పిలిచాడు. కానీ శ్రీనాథ్ ఎటూ చూడక వెళ్లిపోసాగాడు. ``శ్రీనాథ్'' మళ్లీ గట్టిగా పిలిచాడు. ఈసారి ఆకాశ్ తల పక్కకు తిప్పి అటూ ఇటూ చూసాడు.

తన తప్పు అర్థమైంది అర్జున్‌కి. 'ఇప్పుడతని పేరు శ్రీనాథ్ కాదు' అనుకుని ``ఆకాశ్...ఆకాశ్'' అంటూ జనం మధ్య నుండి పరుగెట్టాడు అర్జున్. ఎందరో అభిమానులు ఆకాశ్‌కు ఆటోగ్రాఫ్ అడుగుతున్నారు. ఆకాశ్ చిరునవ్వుతో అందరికీ ఆటోగ్రాఫ్ ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాడు. ఆకాశ్ ప్రక్కనున్న తనుమటుకు అందర్నీ



## ఐశ్వర్య శత్రువులు



లవ్‌లో పడ్డ వారికి ప్రపంచంలోని అందరూ శత్రువుల్లాగే కనిపిస్తారు తాము తప్ప. సల్మాన్ లవ్‌లో పడ్డ ఐశ్వర్యకి ఎవరెంత చెప్పినా నమ్మడం లేదుట సల్మాన్ గురించి. సల్మాన్ అంత ఉమనైజర్ లేరని ఐశ్వర్యకి తల్లిదండ్రులు ఎంత చెప్పినా నమ్మించలేక పోయారట. ఏది ఏమైనా ఇప్పుడు ఐశ్వర్యకి తన మమ్మీ డాడీయే అసలైన శత్రువుల్లా కనబడుతున్నారట. అవును మరి ప్రేమ గుడ్డిదికదా!

## ఛానల్స్‌తో తారల లింకులు

శాటిలైట్ ఛానల్స్‌వల్లనే తమ సినిమాల గిరాకీ తగ్గిందని అందరూ గోల పెడుతున్నా, వాటి ఇంపార్టెంట్ వాటికుందని మళ్లీ మెచ్చుకున్న వాళ్ళూ లేకపోలేదు. టీవీ ఛానల్స్‌ని తిట్టుకున్నా వాటితో లింకులు తప్పడంలేదు వీరికి. మీరే గమనించాలి.

★ అమితాబ్‌బచ్చన్, జయాబచ్చన్‌కి సహారా టీవీతో

★ జాకీష్రాఫ్ సోనీ టీవీతో

★ షారూఖ్‌ఖాన్ బి4యుకి డైరెక్టర్ కూడా.

★ కరిష్మా ఎస్‌బిబి టీవికి.

- విరాజి

తోసేస్తూ ఆకాశ్‌ను కారువద్దకు తీసుకువచ్చాడు. అర్జున్ గబగబా కారు డోర్‌వద్దకు జనాల్ని తోసుకుని వచ్చాడు. అప్పటికే అతని షర్ట్ చిరిగి పీలికలై వేలాడుతోంది.

''ఆకాశ్...ఆకాశ్'' గబగబా పిలిచాడు. ఆకాశ్ అతని వైపు ఆశ్చర్యంగా చూడసాగాడు.

''ఆకాశ్...నేనురా నీ ఫ్రెండ్ అర్జున్‌ని. నువ్వెంత ఎదిగిపోయావురా?'' అంటూ ఏదో అనబోయేంతలో ఒక పోలీసు వచ్చి ''ఏయ్...ఏయ్ ఎవర్నువ్వు? వెళ్లిక్కడ్నించి'' అంటూ గదిమాడు.

అయినా అర్జున్ ''శ్రీ...శ్రీ...నేను అర్జున్‌ని. గుర్తు లేనా?'' అంటూ అతని చేయి పట్టుకున్నాడు. ఆకాశ్ ప్రక్కనున్నతను వచ్చి ఆకాశ్‌ను కారు లోపల కూర్చోబెట్టి తను కూర్చుని డ్రైవర్‌ని కారు స్టార్ట్ చేయమన్నాడు. కారు వెళ్లిపోవడంతో జనమంతా ఎక్కడివారక్కడ చెల్లాచెదరయ్యారు.

• • •

''ఏవండీ! ఏమన్నాడు మీ ఫ్రెండు?'' అడిగింది ఆత్రంగా గేటు దగ్గర నిల్చుని వున్న వసుధ.

ఏమీ మాట్లాడక కోపంగా లోపలకెళ్లిపోయాడు అర్జున్.

గదిలో కొచ్చిన తర్వాత భర్త అవతారాన్ని చూసి విస్తుపోయిందో క్షణం.

''ఇదేమిటండీ వున్న ఒక్కగానొక్క మంచి షర్టు ఇలా చింపుకొచ్చారు. అక్కడేమైనా కొట్లాటగానీ జరిగిందా? అసలేం జరిగిందండీ? సభ బాగా జరగలేదా?'' అడిగింది గట్టిగా. అప్పుడూ మౌనమే సమాధానం అయింది.

''మాట్లాడరేమండీ?'' మళ్లీ అడిగింది.

''ఏం మాట్లాడమంటావ్? నాకక్కడ రాచమర్యాదలు జరిగాయని చెప్పమంటావా? లేక విందు భోజనాలు పెట్టారని చెప్పమంటావా?'' అడిగాడు కోపంగా.

''అసలు...మీరు మీ ఫ్రెండ్ దగ్గరకెళ్లారా?''

''వెళ్లాను. నేనెవరో తెలీనట్టే నటించాడు. పెద్ద యాక్టర్‌కదా. నీకు నేను ముందే చెప్పాను డబ్బుతోపాటు పెద్ద పెద్ద వాళ్ళతో కొత్త స్నేహాలు కూడా పెరుగుతాయని, బంధుత్వాలు కలుస్తాయని? అటువంటప్పుడు నాలాంటి నిరుపేద స్నేహితుడు వాడికెందుకు గుర్తుంటాడు వసూ? అసలు గుర్తున్నా ఎవరో తెలీనట్టే ప్రవర్తిస్తారు. ఎందుకో తెలుసా? నాలాంటివాడు తన స్నేహితుడని చెప్పుకోవడానికి సిగ్గుకదా. అందుకు. వసూ! డబ్బుకున్న విలువ ఈ ప్రపంచంలో దేనికీలేదు. ఎస్! డబ్బే ప్రపంచాన్ని శాసిస్తోంది. డబ్బే ప్రపంచాన్ని నడిపిస్తోంది, ఆడిస్తోంది. అది దగ్గరైన వాళ్ళను దూరం చేయగలదు, దూరమైనవాళ్ళను దగ్గర చేయగలదు. దానికున్న మహిమ అటువంటిది. అయినా అంత కీర్తి ప్రతిష్ఠలు, పేరు ప్రఖ్యాతులు సాధించినవాడు నన్ను గుర్తుంచుకోవాలనుకోవడం నా పొరపాటు. నాతో మాట్లాడతాడనుకోవడం నా అపోహ. ఏదో తల్లీదండ్రీ ఒకేసారి పోయి అనాథ అయ్యాడని తల్లీదండ్రీ లేని లోటు మా అమ్మానాన్న తీర్చారు. అన్నలేని లోటును నేను తీర్చాను. ఒక అన్నగా, స్నేహితుడిగా ఎంతో ప్రేమగా చూసాను. వాడికి మేం పోషించగల స్థోమత ఉండేది కాబట్టి పోషించాం. దాన్ని గుర్తించుకుని మనల్ని ఆదరించాలనుకోడం అవివేకం. ఆప్యాయత చూపాలనుకోవడం దురాశే అవుతుంది.

వసూ! వాడు నాకు స్నేహితుడు కాదనుకుంటాను. అసలు నాకటువంటి స్నేహితుడే ఉండేవాడు కాదని అనుకుంటాను'' అంటూ శ్రీ, తను ఒకరి భుజాలమీద ఒకరు చేయి వేసుకుని తీసుకున్న ఫోటోని తీసి నేలకు కొట్టబోయాడు.

''ఆగు అర్జున్'' అన్న మాట వినిపించడంతో తలెత్తి చూసాడు.

''శ్రీ...'' అన్నాడాశ్చర్యంగా అర్జున్.

''అవున్రా! శ్రీనే. పేరు మార్చుకున్నంత మాత్రాన మనిషి కూడా మారిపోయాననుకున్నావా?''

''మరి నువ్వు? ఆ సభలో అలా...'' అర్థోక్తిగా ఆపేశాడు.


''నువ్వు అపార్థం చేసుకోవడంలో అర్థం వుంది అర్జున్. కానీ నేనేం చేయను చెప్పు? నా చేయి తగిలితే చాలనుకునే జనాలు నా చుట్టూ వున్నారు. నా నోటి మాటలు మంచి ముత్యాలుగా భావించే వాళ్ళున్నారక్కడ. అక్కడ నీతో మాట్లాడితే రసాభాస అవుతుంది. అప్పటికే ఎంత రభస జరిగిందో, నాకోసం ఎంత తొక్కిసలాట జరిగిందో నువ్వే స్వయంగా చూసావుకదా? నేనింకా అక్కడే నిల్చుని నీతో మాట్లాడ్డం జరిగితే జనాల్ని కంట్రోల్ చేయడం పోలీసుల తరం కూడా కాదు. అందుకే ఏమీ మాట్లాడక గబగబా కారెక్కిపోయాను. నన్నాదరించి, అన్నం పెట్టి, ఆప్యాయతను పంచి ఇచ్చిన నీ కుటుంబాన్ని మర్చిపోతే నేను కుక్కకంటే హీనుడ్ని అవుతాను'' అన్నాడు ఆవేదనగా.

''శ్రీ...''

''అవున్రా అర్జున్! కుక్కకైనా విశ్వాసం వుంటుంది. మరి నేను అంతకంటే హీనుడ్ని, నీచుడ్ని కాదురా?''

''శ్రీ...అవేం మాటలు? నీనుండి మేమేమీ ఆశించి నీకప్పుడు సహాయం చేయలేదు. మానవతా దృష్టితోనే మా అమ్మా నాన్నా ఆదుకున్నారు. అందుకు నువ్వు మళ్లీ మమ్మల్ని ఆదుకోవాలని నేను ఆశించలేదు. మనం చిన్నప్పటినుండి అన్నదమ్ముల్లా, స్నేహితుల్లా పెరిగాం. నిన్న అనామకుడిగా వున్న నువ్వు నేడు పేరు ప్రఖ్యాతులు సంపాదించావ్? అటువంటి నువ్వు కనీసం నన్ను గుర్తించకపోవడం నాకు చాలా బాధ కలిగించింది.''

''అర్జున్! అసలు నిన్ను మర్చిపోతానని ఎలా అనుకున్నావురా? మీ అమ్మానాన్నా నన్నాదరించి వుండకపోతే ఏ గాలికో, ధూళికో పెరిగి ఏ రౌడీగానో, గూండాగానో తయారయ్యేవాడ్ని. నీకు తెలుసుకదా నాకు సినిమా పిచ్చి బాగా వుండేదని. అందుకే మద్రాస్ రైలెక్కేసాను. అక్కడ పడరాని పాట్లు పడ్డాను. ఆఖరికి ఒక పార్ట్‌టైం



ఉద్యోగం సంపాదించి ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో చేరాను. డిప్లొమో పొందాను. చిన్న వేషాలు వేసేవాడ్ని. ఒక షూటింగ్‌లో నా ప్రతిభను గుర్తించిన నిర్మాతొకరు తన సినిమాలో క్యారెక్టర్ ఏక్టర్‌గా తీసుకున్నాడు. అది హిట్టయింది. మరో సినిమాలో సైడ్ హీరోగా వేశాను. అంతే! మరి నేను వెనక్కి తిరిగి చూడలేదు. ఒక్కో మెట్టు ఎక్కి ఈ స్థానాన్ని పొందాను. నీ గురించి వాకబు చేస్తునే వున్నాను. ఇక్కడి అడ్రస్‌కు ఉత్తరాలు వ్రాస్తే తిరిగొచ్చేసాయి. వేరే ఊరు వెళ్లిపోయి వుంటారనుకున్నాను. నాకు ఇక్కడకు రావడానికి అసలు తీరిక చిక్కలేదు. హైదరాబాద్‌లో శతదినోత్సవం అనగానే మన ఊరే గుర్తుకువచ్చింది. ఈ సభ ముగిసిన తరువాత ఈ ఇంటికి రావాలని, అసలు విషయం కనుక్కోవాలని అనుకున్నాను. కానీ నువ్వే సభకు వచ్చావు. అర్జున్! నిన్నక్కడ చూసినప్పుడు నా ఆనందం వర్ణించలేనురా! నా అనుకునే వాడు దొరికిన సంతోషం, ఆనందం నాకప్పుడు తెలిసింది. అర్జున్! నువ్వన్నట్లు డబ్బుతో స్నేహాలు పుట్టుకొస్తాయి. కానీ అవి డబ్బున్నంతవరకే నిలుస్తాయి. లేమిలో ఆదుకున్నవాడేరా నిజమైన స్నేహితుడంటే. ఈ సినీ ప్రపంచం ఒక మాయాజాలంలాంటిది. నేడు నాకు దశ తిరిగిందని నా అడుగులకు మడుగులొత్తుతున్నారు. అదే రేప్పొద్దున ఓ నాలుగు సినిమాలు ఫ్లాప్ అయితే నా ముఖం చూడరు. అర్జున్! నువ్వు నాకు కావాలి. నీ స్నేహం కావాలి. నీ ఆప్యాయత, అనురాగం నాకు కావాలి. నాకు అన్నివేళలా నువ్వు తోడుంటావని మాటివ్వరా అర్జున్'' అన్నాడు ఆర్ద్రంగా ఆకాశ్.

''శ్రీ...'' అర్జున్‌కు ఆనందంతో మాట పెగల్లేదు. తన స్నేహితుడు డబ్బొచ్చినా, పేరు ప్రఖ్యాతులు సంపాదించినా మారలేదన్న ఆనందం అతన్ని మాట్లాడనీయకుండా చేసాయి.

''డాడీ! ఈ కొత్తంకుల్ ఎవరు?'' అన్న పిలుపుకు వారివురూ అటు చూసారు.

''అర్జున్! వీళ్ళు...వీళ్ళు కొంపదీసి నీ పిల్లలు కాదు కదా?'' అన్నాడు నవ్వుతూ.

''అవును. వీళ్లిద్దరూ నా పిల్లలు. ఇదిగో ఈమె మీ వదిన వసుధ'' అన్నాడు.

''మాటల్లోపడి ప్రపంచాన్నే మరచిపోయాం. నమస్కారం వదినా'' అని ''నేను మీ చిన్నాన్నను'' అని పిల్లల్ని దగ్గరకు తీసుకుని అర్జున్‌వైపు తిరిగి ''అమ్మా నాన్నా ఎక్కడ? లోపల పడుకున్నారా?'' అంటూ లోపలకు వెళ్లిన శ్రీ షాక్ కొట్టినట్టు నిల్చుండిపోయాడు.

అక్కడ వాళ్ళ ఫోటోకి దండ వేసి వుంది.

''అర్జున్! అమ్మా నాన్నా...'' అన్నాడు. అతనికి లోనుండి తన్నుకొస్తున్న ఏడుపు అతన్ని మరి మాట్లాడనివ్వడంలేదు.

''నీ అభివృద్ధిని చూసే అదృష్టం వాళ్ళకు లేదురా శ్రీ. మా పెళ్ళయిన సంవత్సరానికే ఒక్క నెల తేడాలో ఇద్దరూ పోయారు. నీకోసం ఎంతగానో వెదికారు నాన్న. పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ కూడా ఇచ్చారు. అమ్మయితే ఏడ్వని రోజంటూలేదు. ఎప్పటికైనా నీ జాడ తెలుసుకుని ఈ ఇంట్లో సగం వాటా ఇమ్మని నావద్ద మాట తీసుకున్నారు'' అన్నాడు.

''అర్జున్! వాళ్ళు అమృతమూర్తులు. వారిని చూసే అదృష్టం మరి నాకీ జన్మలో లేదురా'' అని ఒక్క నిముషం ఆగి ''నీ సంగతి చెప్పలేదు? ఏం ఉద్యోగం చేస్తున్నావు?'' అని అడిగాడు.

''నేను చదివిన డిగ్రీ నాకో ఉద్యోగం ఇవ్వలేకపోయిందిరా శ్రీ. దాంతో పెళ్లాంబిడ్డల్ని పోషించుకోవడానికి ఒక కాంట్రాక్టర్ వద్ద గుమస్తాగా చేరాను. అతని పని ఎక్కడుంటే అక్కడకు వెళ్లవలసిందే. ఇన్నేళ్ళు ఒరిస్సాలో వుండి ఈమధ్యే ఇక్కడకు వచ్చాను. వచ్చిన తరువాత ఒక సినిమా పత్రికలో నీ ఫోటో చూడడం తటస్థించింది. నిన్నెలాగైనా చూడాలని ఆ సభకు వచ్చాను. నువ్వింత ఉన్నత స్థితిలో వున్నందుకు నాకు చాలా ఆనందంగా వుందిరా శ్రీ. కనీసం నా స్నేహితుడైనా ఒక గొప్ప మనిషైనందుకు నేను గర్విస్తున్నాను'' అన్నాడు సంతోషంగా.

''అర్జున్! నీవంటి స్నేహితుడు దొరకడం నా పూర్వజన్మ సుకృతం. ఈరోజు నుండి నువ్వే నా పర్సనల్ సెక్రటరివి. నువ్వూ నాతోపాటు మద్రాస్ వచ్చేయ్. అక్కడ మా ఇంట్లోనే నాతోపాటు వుందువుగానీ'' అన్నాడు.

''శ్రీ...'' అని అతన్ని గాఢంగా కౌగలించుకున్నాడు అర్జున్.

''అవున్రా అర్జున్. కనీసం ఇలాగైనా మీ ఋణం తీర్చుకునే అవకాశం వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా వుంది'' అన్నాడు.

ఇంతలో డ్రైవర్ వచ్చి ''సార్! పార్టీకి టైమవుతోంది'' అన్నాడు.

''అర్జున్! ఇక్కడి థియేటర్లవాళ్ళు, పంపిణీదారులు శతదినోత్సవం సందర్భంగా నాకు పార్టీ ఇస్తున్నారు. నేను అక్కడికి అర్జంటుగా వెళ్లాలి. రేపు, ఎల్లుండి సభలు ముగిసిన తరువాత నేను మద్రాస్ వచ్చేస్తాను. అప్పటికి మీరక్కడ వుండాలి. అక్కడ ఇంటికి ఫోన్‌చేసి చెబుతాను మీరు వస్తారని. రేపు లారీ పంపుతాను. అందులో సామాన్లువేసి మీరు వచ్చేయండి. మరి నేవస్తాను'' అన్నాడు.

ఇరువురూ చేతిలో చేయి వేసుకుని కారువద్దకు వచ్చారు. అప్పటికే ఎలా తెలిసిపోయిందో కారువద్దకు జనం గుమిగూడారు. అందరికీ మరోమారు వీడ్కోలు పలికి కారెక్కాడు. కారు విండోలో నుండి అర్జున్ చేతిలో ఏదో కవరు పెట్టాడు. కారు రివ్వుమంటూ ముందుకు దూసుకుపోయింది. కారుతోపాటు జనం కూడా చెల్లాచెదురయ్యారు. శ్రీవెళ్లిన తరువాత కవరు తెరిచి చూసిన అర్జున్‌కు ఆనందంతో కళ్ళు చెమర్చాయి. అందులో శ్రీ విజిటింగ్ కార్డు, ఐదువందల రూపాయల నోట్ల కట్ట వుంది.

''విజయపు శిఖరాన్ని అధిరోహించినా కష్టపు మెట్లను మరువని నిజమైన స్నేహితుడివి నువ్వు శ్రీ'' అనుకున్నాడు మనసులో.

★

## చప్పుడు చెయ్యనిది



''నీవు కొన్నకారు ఎలావుంది?'' అడిగాడు రాము.

''దానిలో శబ్దం చెయ్యని ఒకే ఒక భాగం హారన్ మాత్రమే.'' అన్నాడు సోము.

## అసలు సంగతి

''అయ్యా! నామీద మీకు నమ్మకం లేనందువల్ల ఈ ఉద్యోగం మానుకుంటున్నాను.'' అన్నాడు నౌకరు.

''అలా ఎవరన్నారు? నా ఇనప్పెట్టె తాళం చెవులు కూడా నీకే ఇస్తున్నాను కదా-'' అన్నాడు యజమాని.

''నిజమే! వాటిల్లో ఏ ఒక్క ఇనప్పెట్టె తెరిచేందుకు సరిపోవడంలేదు.''

చెప్పాడు నౌకరు.

## టీచర్

''మనం చెప్పే విషయం ఎదుటివారు వినకపోయినా, ఇంకా చెప్పడం ఆపని వారిని ఏమని సంబోధిస్తాం?'' అంది టీచర్.

''టీచర్!'' అన్నాడో కొంటె విద్యార్థి.

## తిరిగి ఇవ్వండి

ఒక లావాటి ధనవంతుడు హోటల్ రూమ్ ఖాళీ చేసి వెళ్ళబోతున్నాడు.

మేనేజర్: ''మీరు వెళ్ళేముందు ఒక వ్యాయామం చేయండి. ముందుకు వంగి, మోకాళ్ళను వంచకుండా, మీ సూట్‌కేసును తాకండి.''

ఆ వ్యక్తి: ''మంచిది. నేను నా సూట్‌కేస్ తాకాను. తరువాత ఏం చేయాలి?''

మేనేజర్: ''దాన్ని తెరవండి. మా టవల్స్ మాకు తిరిగి ఇవ్వండి.''

- స్వాతి

